VC NEWS

# వేగుచుక్క


పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ నవంబర్ 22 శుక్రవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 118



2లో

ఢిల్లీలో కాలుష్యానికి తోడు పొగమంచు

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# అదానీతో అనుబంధం దేశానికే అవమానం



హైదరాబాద్:అదానీ గ్రూప్స్ అధినేత గౌతమ్ అదానీపై యూఎస్ అభియోగాలు నమోదయ్యాయి. కంపెనీ అధికారులకు లంచాలు ఇవ్వజూపడంతోపాటు ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధుల సమీకరణకు పాల్పడినట్లుగా న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు.దానీ గ్రూప్స్ అధినేత గౌతమ్ అదానీపై యూఎస్ అభియోగాలు నమోదయ్యాయి. కంపెనీ అధికారులకు లంచాలు ఇవ్వజూపడంతోపాటు ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధుల సమీకరణకు పాల్పడినట్లుగా న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆసక్తికర ట్వీట్ చేశారు. అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు.. భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడని విమర్శించారు. అదానీతో కాంగ్రెస్, బీజేపీ అనుబంధం దేశానికి అవమానం, అరిష్టమన్నారు. రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎంత ఇవ్వజూపిండో, మూసీలో అదానీ వాటా ఎంతో అంటూ ప్రశ్నించారు. ఇలాంటి మోసగాడికి.. దగాకోరుకా.. తెలంగాణలో పెట్టుబడుల అనుమతులు ఎలా ఇచ్చారంటూ మండిపడ్డారు. తక్షణం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని.. అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలు అన్నీ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఆస్తులను కొల్లగొట్టే మీ కుయుక్తులలో మీ భడే భాయ్ వాటాఎంత ? మీ అదానీ భాయ్ వాటా ఎంత? మీ హైకమాండ్ వాటా ఎంత? అంటూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా నిలదీశారు.గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్‌తో పాటు మరో ఏడుగురిపై అభియోగాలు నమోదయ్యాయి. అదానీ, అనుబంధ సంస్థలు 20 సంవత్సరాల్లో రెండు బిలియన్ డాలర్ల లాభం పొం సోలార్ పవర్ ప్లాంట్ ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు 265 మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వ జూపినట్లుగా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అమెరికాతో పాటు ఇంటర్‌నేషనల్ ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధులను సమీకరించేందుకు కంపెనీ ప్రయత్నించారని అభియోగాలు మోపారు.అదానీ గ్రీన్ ఎనర్జీలో అక్రమ మార్గాల ద్వారా కంపెనీ మూడు బిలియన్ డాలర్లకుపైగా రుణాలు, బాండ్లను సేకరించినట్లుగా న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ మరో

సివిల్ కేసు నమోదు చేసింది. యూఎస్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించి అదానీ గ్రీన్ ఎనర్జీ అమెరికా ఇన్వెస్టర్ల నుంచి 175 మిలియన్ డాలర్లకుపైగా సేకరించినట్లుగా ఆరోపించింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపి జరిమానాతో పాటు కంపెనీపై ఆంక్షలు విధించాలని రెగ్యులేటర్ కోరింది.

**అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు**

**భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడు**

**అదానీతో కాంగ్రెస్, బీజేపీ అనుబంధం దేశానికి అవమానం**

**రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు బేరమెంత?**

**మూసీలో అదానీ వాటా ఎంతో చెప్పండి**

**తెలంగాణలో పెట్టుబడుల అనుమతులు ఎలా ఇచ్చారు? తక్షణం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలి అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలు అన్నీ బయట పెట్టాలి తెలంగాణలో ఆస్తులను కొల్లగొట్టే మీ కుయుక్తులు అందులో మీ భడే భాయ్ వాటాఎంత ? మీ అదానీ భాయ్ వాటా ఎంత? మీ హైకమాండ్ వాటా ఎంత?.. రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు పిల్లలు పిట్టల్లా రాలుతుంటే దిద్దుబాటు చర్యలేవి? విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించలేని రేవంత్.. మహిళలను కోటీశ్వరులను చేస్తాడట వేదికల మీదికెక్కి పిట్టలదొర మాటలు సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు**



2లో

## రాష్ట్రపతి పర్యటన



2లో

## ఎన్నికల హామీలను విస్మరించిన రేవంత్

లగచర్ల ఘటనపై సిపిఎం విమర్శలు



2లో

## ఆదానీని తక్షణమే అరెస్ట్ చేయాలి

సెబీ చీఫ్ మాధభి పురీ బచ్‌పైనా విచారణ జరిపించాలి

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్

# మూసీ పునరుజ్జీవం నుంచి వెనక్కి తగ్గం



2లో

**ఎన్ని శక్తులు అడ్డుపడినా పూర్తి చేస్తాం**

**హైదరాబాద్‌ను ప్రపంచస్థాయికి తీసుకు వెళతాం**

**ఎక్స్ వేదికగా స్పష్టం చేసిన సిఎం రేవంత్**

మూసీ పరీవాహక ప్రాంతం మురికి కూపంగా మారి.. హైదరాబాదీలకు విష వాయువులు అందిస్తుందని, దుర్భరంగా మారిన వారి జీవన విధానం మార్చేందుకు మూసీని ప్రక్షాళన చేసి, పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మూసీ వెంట నరకం అనుభవిస్తోన్న పేదవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

# రేవంత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

**గుంట భూమిని కబ్జా చేసినట్లు రుజువు చేయగలవా**

**కబ్జాల చరిత్ర మీదే అంటూ హరీష్ రావు ఘాటు విమర్శలు**



2లో

# డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు

## పలు బిల్లుల ఆమోదం కోసం ప్రభుత్వం కసరత్తు

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయని ప్రభుత్వం వెల్లడించింది సమావేశాల్లో పలు కీలక చట్టాల ఆమోదానికి రేవంత్ సర్కారు సన్నద్ధం చేస్తోంది. ఆర్ఓఆర్ చట్టాన్ని ఆమోదించాలని చూస్తోంది. రైతు, కులగణన సర్వేపై కూడా సమావేశాల్లో చర్చించే అవకాశం కనిపిస్తోంది. అసెంబ్లీ సమావేశాలతో పాటు మంత్రివర్గ విస్తరణ మీద కూడా ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని తెలుస్తోంది.

డిసెంబర్ 7వ తేదీతో రేవంత్ సర్కార్ ఏడాది కాలం పూర్తి చేసుకోనుంది. దీంతో మంత్రివర్గ విస్తరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిసింది. అయితే మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని వినిపిస్తోంది. కానీ ఆలోపే మంత్రివర్గాన్ని విస్తరించేందుకు కసరత్తు జరుగుతోందని కూడా సమాచారం అందుతోంది. మరోవైపు పంచాయతీ ఎన్నికలపై కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. పంచాయతీ ఎన్నికలకు ముందే ఆసరా పెన్షన్, రైతు భరోసా పథకం కింద ఇచ్చే మొత్తాన్ని



పెంచేందుకు రేవంత్ సర్కారు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఎలక్షన్స్‌కు ముందు పెన్షన్, రైతు భరోసాను పెంచితే ప్రభుత్వానికి మంచి పేరుతో పాటు పార్టీకి మైలేజీ వస్తుందని భావిస్తున్నారట. అసెంబ్లీ సమావేశాలు, పంచాయతీ ఎన్నికల మీద ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్.. అందుకు అనుగుణంగా కులగణను చేపట్టారు. మరోవైపు కొండపోచమ్మ సాగర్ దగ్గరలోని మాజీ మంత్రి హరీష్ రావు ఫామ్‌హౌస్‌పై విచారణ జరిపించాలని నిర్ణయించారు. గత పదేళ్లలో కెసిఆర్ ప్రభుత్వం చేసిన అవినీతికి సంబంధించి అసెంబ్లీలో వాడివేడీ చర్చకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.



## ఆడబిడ్డకో న్యాయం.. ఆదానీకో న్యాయమా

మోడీని విమర్శిస్తూ...ఎమ్మెల్సీ కవిత సంచలన ట్వీట్

**హైదరాబాద్:** అదానీ వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత సంచలన ట్వీట్ చేశారు. బీజేపీ, ప్రధాని మోదీపై కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. జైలు నుంచి విడుదల అయ్యాక తొలిసారి కవిత రాజకీయ వ్యాఖ్యలు చేశారు. ఎన్నిసార్లు ఎన్ని ఆరోపణలు వచ్చినా ప్రధాని అదానీ వైపేనా..? అని కవిత ప్రశ్నించారు.అఖండ భారతంలో అదానికో న్యాయం.. ఆడబిడ్డకో న్యాయమా అని ప్రశ్నించారు. ఆధారాలు లేకున్నా ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేయడం ఈజీ. ఆధారాలు ఉన్నా అదానీని అరెస్ట్ చేయడం మాత్రం కష్టమా అని కవిత ప్రధానిని ప్రశ్నించారు. ఎన్ని సార్లు ఆరోపణలు వచ్చినా ప్రధాని అదానీ వైపేనా అని సూటిగా ప్రశ్నించారు కవిత.

## రాష్ట్రపతి పర్యటన నేపథ్యం
### నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు



**హైదరాబాద్:**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండురోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. హైదరాబాద్‌లో జరిగే పలు కార్యక్రమాలకు ఆమె హాజరవనున్నారు. ఈ క్రమంలో నగర పరిధిలో రెండురోజులు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని హైదరాబాద్ పోలీసులు తెలిపారు.
పంజాగుట్ట జంక్షన్, గ్రీన్‌ల్యాండ్ జంక్షన్, బేగంపేట్ ఫ్లై ఓవర్, శ్యాంలాల్ బిల్డింగ్, పీపీఎన్‌టీఫ్లై ఓవర్, హెచ్‌పీఎస్ అవుట్‌గేట్, ఎయిర్‌పోర్టు వై జంక్షన్, మోనప్ప జంక్షన్, యశోద హాస్పిటల్, కత్రియ హోటల్, మెట్రో రెసిడెన్సీ, పీవీ విగ్రహం, రాజ్ భవన్ రోడ్, ఖైరతాబాద్ రోడ్డు, తెలుగు తల్లి జంక్షన్‌తో పాటు ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, ఎన్టీఆర్ మార్గ్, కట్టమైసమ్మ, ఇక్బాల్ మినార్, ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం జంక్షన్, అశోక్‌నగర్ జంక్షన్, ఎన్టీఆర్ స్టేడియం ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మాదాపూర్, రాయదుర్గం, కొత్తగూడ, గచ్చిబౌలి, కొండాపూర్ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని చెప్పారు. ఈ క్రమంలో వాహనదారులు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సూచించారు.

## ఆదానీని తక్షణమే అరెస్ట్ చేయాలి



**న్యూఢిల్లీ:**లంచం ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదైన అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. సెబీ చీఫ్ మాధభి పురీ బచ్‌పైనా విచారణ జరిపించాలన్నారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా ప్రధాని మోదీపై మరోసారి విమర్శలు ఎక్కుపెట్టారు. అమెరికా, భారత చట్టాలను అదానీ ఉల్లంఘించారనే విషయంపై ఇప్పుడు స్పష్టత వచ్చిందని రాహుల్ గాంధీ అన్నారు. మోదీ, అదానీల బంధం భారత్‌లో ఉన్నంత వరకే సురక్షితమన్నారు. తాజా ఆరోపణలపై తక్షణమే జేపీసీతో విచారణ జరిపించాలన్నారు. శీతకాల సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామన్నారు. తన అవినీతి ద్వారా దేశ ఆస్తులన్నీ అదానీ కొల్లగొట్టారని ఆరోపించారు. ఆయనను వెంటనే అరెస్ట్ చేసి విచారిస్తే విషయాలన్నీ బయట పడతాయని అన్నారు. ఆయనను రక్షిస్తున్న సెబీ చీఫ్‌ను ఆ పదవి నుంచి తొలగించి ఆమె పైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లంచం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా సంబంధం లేకుండా విచారణ జరిపించాలని రాహుల్ గాంధీ కోరారు. 'అదానీ అరెస్టు కాదని, ఆయనపై విచారణ జరగదని నేను గ్యారంటీ ఇస్తాను. ఎందుకంటే ఆయన్ను మోదీ కాపాడుతున్నారు' అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

## ఎన్నికల హామీలను విస్మరించిన రేవంత్
### లగచర్ల ఘటనపై సిపిఎం విమర్శలు



హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ పునరుద్ధరించడమే నా 7వ గ్యారంటీ అని రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు చెప్పాడు. నేడు అధికారం చేపట్టాక మాట మార్చాడని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం తమ్మినేని ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా లగచర్లలో వామపక్ష నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి అధికారం చేపట్టాక ప్రగతి భవన్ ముందున్న గేట్లు కూల్చి వేశాడు. అదొక్కటి తప్పా ఆయన చేసే పనులన్నీ అప్రజాస్వామ్యకంగానే నడుస్తున్నాయన్నారు. హైడ్రా కూల్చి వేతలు, మూసీ పరీవాహక ప్రాంతం, గ్రూప్ వన్ ఎగ్జామ్, దామగుండం ఇలా ప్రతి పనిని ఏకపక్షంగా చేశారని మండిపడ్డారు. లగుచర్లలో ఫార్మా సిటీ పేరుతో గిరిజనుల భూములు లాక్కోవడం అన్యాయమన్నారు. గతంలోనే ఫార్మా సిటీ కోసం 13 వేల ఎకరాలు సేకరించారు. దానిపై రేవంత్ రెడ్డి వైఖరేంటో చెప్పాలన్నారు. ఇప్పుడు మళ్లీ లగుచర్లలో 13 వందల ఎకరాలు సేకరించాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. రేవంత్ రెడ్డి పాలన అప్రజాస్వామికంగా కొనసాగుతుందని విమర్శించారు.

## ఢిలలీలో కాలుష్యానికి తోడు పొగమంచు
### గాలి నాణ్యత పడిపోవడంతో ఆందోళన

న్యూఢిల్లీ,: దేశ రాజధాని నగరం ఢిల్లీలో వాయు కాలుష్యం కొనసాగుతున్నది. ఓ వైపు కాలుష్యంతో ఇబ్బందులుపడుతుండగా.. మరో వైపు భారీ మంచుదుప్పటి నగరాన్ని కమ్మేసింది. దాంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలుష్యం నిరంతరం పెరుగుతుండడంతో ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో గురువారం వాయు నాణ్యత సూచీ (ఀఖఎ) 400 దాటడంతో గ్యాస్ ఛాంబర్‌గా మారింది. ఫలితంగా జనం ఊపిరిపీల్చుకునేందుకు తిప్పలు పడుతున్నారు. ఎక్కువగా ఆరుబయట తిరుగుతుండడంతో ఛాతిలో మంట, కళ్లలో మంటగా ఉంటుందని వాపోతున్నారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (అఖఅః) డేటా ప్రకారం.. గురువారం ఉదయం 8 గంటలకు ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 405గా రికార్డయ్యింది. ముండ్కాలో 413, బవానాలో 418, అశోక్ విహార్‌లో 414, ఐటీవోలో 355, జహంగీర్‌పురి 435, రోహిణి 407 రికార్డయ్యింది. నజాఫ్‌గఢ్ 366, ఆర్‌కేపురం 387, పంజాబీ బాగ్ 407, సోనియా విహార్ 394, ద్వారకా సెక్టార్-8 వద్ద 401 నమోదైంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ ప్రకారం.. నగరంలో వాయువ్య దిశ నుంచి గంటకు ఎనిమిది కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేసింది. శుక్ర, శనివారాల్లోనూ గాలులు కొనసాగే అవకాశం ఉందని చెప్పింది. అదే సమయంలో దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని.. దాంతో గాలి నాణ్యత మరింత పడిపోతుందని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఉత్తరభారతంలో రాబోయే ఐదురోజుల పాటు దట్టంగా పొగమంచు కురిసే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం ఎన్‌సీఆర్ పరిధిలో గాలి విషపూరితంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. 50శాతం మంది ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం విధానాన్ని అమలు చేస్తున్నది. ఢిల్లీ ప్రభుత్వంలోని 80 విభాగాలు, వివిధ ఏజెన్సీలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం ఉద్యోగుల సంఖ్య దాదాపు 1.40 లక్షలుగా ఉన్నది.

# భూకబ్జా చేస్తే ఊచలు లెక్కించాల్సిందే



పోలీసు వ్యవస్థకు మచ్చ తెచ్చారని మండిపడ్డారు. ఇలాంటి వారిని సస్పెండ్ చేశామని చెప్పుకొచ్చారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇష్టానుసారం ప్రవర్తిస్తే ఎవ్వరినీ ప్రభుత్వం ఉపేక్షించదని వార్నింగ్ ఇచ్చారు.
'తల్లిని, చెల్లిని దూషించినా గత సీఎం పట్టించుకోలేదు. షర్మిలపై వర్రా రవీందర్‌రెడ్డి చేసిన పోస్టులు నా నోటితో నేను చెప్పలేను. అసెంబ్లీలో ఉచ్చరించడానికి కూడా వీల్లేని విధంగా పోస్టులు పెట్టారు. వర్రా రవీందర్‌రెడ్డి పేరుతో వేరేవాళ్లు పోస్టులు పెట్టారని జగన్ అంటున్నారు. జగన్ ఇంకా అతన్ని ఎందుకు వెనకేసుకొస్తున్నారు. అవినాష్‌రెడ్డిపై కూడా కేసు పెట్టాలని షర్మిల చెబుతున్నారు. డిప్యూటీ సీఎం, హోం మంత్రిపై కూడా అసభ్య పోస్టులు పెట్టారు. ఆడబిడ్డలపై ఇష్టానుసారంగా పోస్టులు పెట్టిస్తున్నారు. గత ప్రభుత్వం ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. అందులో వైకాపా వాళ్లనే ఉద్యోగులుగా నియమించారు. వారిచేత అసభ్యంగా పోస్టులు పెట్టించారు. గత ఐదేళ్లలో దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు ఏపీలోనే. గతంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడితే.. తెదేపా కార్యాలయంపై దాడి చేశారు. గతంలో గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకోలేదు. రాష్ట్రంలో ఏ నేరం జరిగినా.. దాని వెనుక గంజాయి బ్యాచ్ ఉంటుంది. గతంలో నాసిరకం మద్యం విక్రయించడం వల్ల గంజాయికి అలవాటుపడ్డారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లోకి కూడా గంజాయి, డ్రగ్స్ చేరాయి. అన్ని వ్యవస్థలను కంట్రోలు చేస్తాం కానీ, గంజాయి కట్టడి చేసేందుకు సమయం పడుతుందని ఎన్నికల ముందే చెప్పాను' అని చంద్రబాబు అన్నారు.
'ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా.. రాజ్యాంగ విరుద్ధంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తెచ్చారు. సివిల్ జడ్జి అధికారాలన్నీ రెవెన్యూ ఉద్యోగులకు ఇచ్చారు. సీఎం అయ్యాక తొలి సంతకం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపైనే పెట్టాను. రాజకీయ ముసుగులో నేరాలు చేసే వాళ్లను చట్టం ముందు దోషులుగా నిలబెడతాం. ఇష్టానుసారం చేయాలనుకుంటే మీ ఆటలు సాగవు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పరిరక్షించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం' అని సీఎం స్పష్టం చేశారు. పోలీసులు ప్రజాహితం కోసం పనిచేయాలని చంద్రబాబు సూచించారు. పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
6,100 మంది పోలీసు కానిస్టేబుళ్లను నియామకం చేస్తామన్నారు. పోలీసు ఫోర్స్ ఆధునికీకరణ కోసం రూ.61 కోట్లను రిలీజ్ చేశామన్నారు. రూ.99 కోట్లు కేంద్రం నుంచి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. గతంలో సీఎం టూర్లకు ప్రైవేటు వావానాలను బలవంతంగా కబ్జా చేసి అప్రతిష్ఠ తెచ్చారని దుయ్యబట్టారు చంద్రబాబు. తమ సర్కారు పోలీసులకు 2,812 కొత్త వాహనాల కోసం రూ.280 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. పోలీసు సంక్షేమం కోసం రూ.20 కోట్లను విడుదల చేశామన్నారు. పోలీసు అమరవీరులను స్మరించుకునేందుకు రాజధానిలో 5 ఎకరాల భూమి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌లను కూడా ఏర్పాటు చేసి పటిష్టపరుస్తామని వివరించారు చంద్రబాబు. ఎంతటి వారైనా సరే తప్పు చేయాలంటే భయపడేలా పోలీసు వ్యవస్థను తీర్చిదిద్దుతామని వ్యాఖ్యానించారు.

# మూసీ పునరుజ్జీవం నుంచి వెనక్కి తగ్గం



హైదరాబాద్,: మూసీ నదిని ప్రక్షాళన చేసి హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తుందని, ఎన్ని శక్తులు అడ్డుపడినా పక్రియ పూర్తి చేసే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.
'నదుల వెంట నాగరికత వర్ధిల్లాలి..నదులను కబళిస్తే.. మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ప్రజా ఆరోగ్యం పటిష్ఠ ఆర్థికం పర్యావరణ కోణాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలి. కానీ, శాపంగా మిగిలిపోకూడదు. మూసీ ప్రక్షాళన చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పం. ఈ తరానికే కాదు.. తరతరాలకు మేలు చేసే నిర్ణయం. ఈ నిర్ణయానికి అండగా నిలవాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో సీఎం రేవంత్ ఓ పోస్ట్ చేశారు. కాగా.. మూసీ పరీవాహక ప్రాంతం మురికి కూపంగా మారి.. హైదరాబాదీలకు విష వాయువులు అందిస్తుందని, దుర్భరంగా మారిన వారి జీవన విధానం మార్చేందుకు మూసీని ప్రక్షాళన చేసి, పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మూసీ వెంట నరకం అనుభవిస్తోన్న పేదవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో యాదవులకు అత్యధికంగా సీట్లు ఇస్తామని, కార్పొరేటర్లు, ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులుగా అవకాశాలు పెంచి నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును అడ్డుకోవాలని చూసేవారు కుక్కచావు చస్తారని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. బుల్డోజర్లు ఎక్కించి అయినా ప్రాజెక్టును చేపట్టి తీరతామని ప్రకటించారు. మూసీ కాలుష్యం వల్ల ఆ నది పరీవాహక ప్రాంత ప్రజలు అణుబాంబుతో కలిగే ప్రమాదం కంటే ఎక్కువ దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరంగా ఉండాల్సిన మూసీ.. శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పునరుజ్జీవంతోనే వారికి ఆ సమస్య నుంచి విముక్తి కలుగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గంగా, సబర్మతి నదులను రూ.40 వేల కోట్లతో సుందరీకరణ చేసుకుంటే, తాను తెలంగాణ ముఖ్యమంత్రిగా మూసీ పునరుజ్జీవం చేయొద్దా? అని ప్రశ్నించారు. ప్రధాని చేసిన పనిని మెచ్చుకుంటూ.. మూసీ ప్రక్షాళనపై నకిలీ బీజేపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. కమీషన్ల కోసమే మూసీ ప్రాజెక్టు చేపట్టానని బీఆర్ఎస్ అంటోందని, ఈ మూసీ ప్రక్షాళన చేయకపోతే తన జన్మ దండగ అని భావోద్వేగానికి లోనయ్యారు. 'రూ.1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన చేపట్టి.. రూ.25 వేల కోట్లు దోచుకునే ప్రయత్నం చేస్తున్నామంటున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రేవంత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు




సంగారెడ్డి: బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు సీఎం రేవంత్ రెడ్డితెరలేపుతున్నాడని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని సీఎం చేసిన తప్పుడు ఆరోపణలపై ఘాటుగా స్పందించారు.గురువారం అందోల్ మండలం మాసాన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగనాయక సాగర్ దగ్గర ఇరిగేషన్ భూములను కబ్జా చేశానని నాపై రేవంత్ రెడ్డి తప్పుడు ఆరోపణ చేశాడు.పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది అన్నట్లు కబ్జాలు చేసే చరిత్ర నీదని ధ్వజమెత్తారు. రైతుల పట్టా భూములను ధరణి ద్వారా13 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. ఒక గుంట కానీ, ఒక ఎకరా కానీ ఇరిగేషన్ భూమి కానీ, ప్రభుత్వ భూమి కానీ తీసుకున్నట్టు నా చరిత్రలో లేదని స్పష్టం చేశారు. ఏ భూమిని అయితే నేను రిజిస్ట్రేషన్ చేసుకున్నానో ఆ భూమిలోనే ఉన్నాను.
నువ్వు ఎప్పుడు వస్తావో చెప్పు రేవంత్ రెడ్డి.. నీ సమక్షంలోనే సర్వే చేద్దాం. నువ్వు ఎన్ని బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసినా భయపడేది లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున రైతుల పక్షాన నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రేవంత్ రెడ్డి రైతులకు తొమ్మిది హామీలను అమలు చేస్తామని ప్రకటించారు. ఇందులో ఏ ఒక్క హామీనైనా నెరవేర్చగలిగాడా అని ప్రశ్నించారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోళ్లలో సైతం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో, పెట్టుబడి
సాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మరోపక్క సివిల్ సప్లై కమిషనర్ 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొంటామని ప్రకటించారు. దీని ఆంతర్యమేమిటని నిలదీశారు. మధ్యలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కడికి పోయిందో చెప్పాలన్నారు. రైతులు పండించిన ధాన్యంలో సగం దళారుల పాలయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు..దళిత, గిరిజన, అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం కొల్లగొడుతున్నది. కంపెనీ నిర్మాణాల కోసం ఆ భూములను తన ఆప్తులకు కట్టబెట్టే ప్రయత్నం సీఎం చేస్తున్నాడు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న కేటీఆర్ పై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు.

## ఏపీలో బిచ్చగాళ్ల మాఫియా..?!



మహిళలు రోడ్డు మీదకు వస్తారు. నిండు గర్భిణి వేషంతో మరికొంత మంది వస్తారు. రూపాయి చేయని పెన్నును పది రూపాయలు పెట్టి కొనాలని దీనంగా అడిగేవారూ ఉంటారు. ఇదంతా ఓ బెగ్గింగ్ మాఫియా అని చాలా మందికి తెలుసు. అయినా కొంత మంది డబ్బులు ఇస్తూంటారు. పోలీసులు పట్టించుకోరు. ఈ మాఫియాను నడిపే వ్యక్తులు లక్షలు వెనకేసుకుంటూ ఉంటారు. పిల్లల్ని పావులుగా పెట్టుకుంటూ ఉంటారు. బెగ్గర్లు లక్షాధికారులుగా ఉన్నారని అనేక చోట్ల నుంచి వార్తలు వస్తున్నాయి. ముంబైలో ఒక్కో బెగ్గర్ లక్షలు సంపాదిస్తారు. లక్నోలో బెగ్గర్లకు ఐ ఫోన్లు కూడ ఆంటాయి. అక్కడ ఓ మాఫియాలాగా వ్యవస్థీకృతంగా ఉందో లేదో ఏపీలో మాత్రం పిల్లల జీవితాలను నాశనం చేస్తూ.. ఏమీ తెలియని వయసులో కూడా వారి ఒంటికి రంగులేసి భిక్షాటనకు పంపుతున్నారు. ఈ మాఫియాపై ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు చేసే అవకాశాలు ఉన్నాయి.

# టియులో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలి.




### - పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్.

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, నవంబర్ 21:**

తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ కోరారు. ఈ మేరకు గురువారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రో. టి.యాదగిరి రావుకు పి.డి.ఎస్.యూ ఆద్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో తెలంగాణ యూనివర్సిటీలో సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయని, పేద విద్యార్థులు యూనివర్సిటీ విద్యకు దూరమవుతున్నారని అన్నారు. బయట పీజీ కళాశాలలకు స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా ఖాళీలను భర్తీ చేసుకోవడానికి అవకాశం ఇస్తున్నారని, కానీ యూనివర్సిటీలో గత కొన్ని సంవత్సరాలుగా ఖాళీ సీట్లను భర్తీ చేయడం లేదని అన్నారు. ఈసారైనా ఖాళీగా ఉన్న ఇంటిగ్రేటెడ్ కోర్సులు, పీజీ, ఎల్ఎల్ బి, బిఎడ్ సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేసి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ యూనివర్సిటీ నాయకులు ప్రిన్స్, రవీందర్, రాకేష్, బాలాజీ, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



# ఉర్దూ భాషలో మరిన్ని పరిశోధనలు జరిపాలి.

### - టియు ఉపకులపతి ఆచార్య టి. యాదగిరిరావు.

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, నవంబర్ 21:**

తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖవి ప్రతిష్టాత్మక రాష్ట్ర ప్రభుత్వ తెలంగాణ ఉర్దూ అకాడమీ చే పరిశోధన, విమర్శ రంగంలో లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు అందుకోవడం అభినందనీయమని వైస్ ఛాన్సర్ ఆచార్య యాదగిరిరావు పేర్కొన్నారు. టియులో గురువారం వైస్ ఛాన్సర్ ఆచార్య టి. యాదగిరిరావు, రిజిస్టర్ ఆచార్య ఎం. యాదగిరి, డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖవి ని శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా యాదగిరిరావు మాట్లాడుతూ, ఉర్దూ విభాగంలో పరిశోధన రంగంలో మరింత లోతుగా పరిశోధనలు జరిపి విశ్వవిద్యాలయానికి గుర్తింపు తీసుకురావాలని అన్నారు. గత పది సంవత్సరాలుగా
యూనివర్సిటీలో వివిధ అకాడమిక్, అడ్మినిస్ట్రేటివ్ పదవులలో సమర్థవంతంగా నిర్వహిస్తున్న అబ్దుల్ ఖవి ఈ ప్రతిష్టాత్మక లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు అందుకోవడంతో తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ( టూటా) అధ్యక్షులు డాక్టర్ ఏ.పున్నయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ బాబు, ఉపాధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, కోశాధికారి డాక్టర్ నాగరాజ్, డాక్టర్ జమీల్ డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ బాలకిషన్ డాక్టర్ నీలిమ ఇతర అధ్యాపకులు నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# స్కౌట్స్ అండ్ గైడ్స్ వేడుకలలో "సత్యశోధక్" విద్యార్థుల ప్రతిభ.

## - అభినందించిన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 21:**

స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ వేడుకలలో నిజామాబాద్ జిల్లా తరపున సిరికొండ "సత్యశోధక్" పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. గురువారం కలెక్టర్ రేట్ లో విద్యార్థులను ప్రశంసిస్తూ, వారితో ముచ్చటించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు నేటి సాంకేతిక పోటీ ప్రపంచంలో సంపూర్ణ విషయ పరిజ్ఞానం పొందుటకు ప్రణాళిక బద్దంగా విద్యానభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. హైదరాబాద్ లో జరిగిన 75 వసంతాల స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర స్థాయి వ్యవస్థాపక దినోత్సవ 'డైమండ్ జూబ్లీ వేడుకల'లో జిల్లా తరపున సత్యశోధక్ పాఠశాలకు చెందిన 16మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొని, వివిధ అంశాలలో అద్భుత ప్రతిభ కనబరిచడం సంతోషకరమని అన్నారు.

కలర్ పార్టీలో మొదటి స్థానంతో పాటు క్యాంప్ క్రాఫ్ట్, ఎగ్జిబిషన్, భౌతిక, సాంస్కృతిక ప్రదర్శనలో ఉత్తమ గ్రేడ్, అవార్డులు సాంధించిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అన్నారు. స్కౌట్స్ విద్యార్థులు డి. శ్రీనాథ్, పి. వర్షిత్, ఎ. శ్రీకాంత్, జి. కార్తీక్, జి. అద్వైత్ రెడ్డి, ఆర్. శ్రీశాంత్, యం. శ్రీవర్ధన్, ఎ. రమనీష్ మరియు గైడ్స్ సి.ఎచ్. కృతిక, బి. భవ్యశ్రీ, డి. శ్రీజ, యన్. స్నితిక, బి. నిధి, బి. పల్లవి సి.ఎచ్. ప్రణవి, జి. సంవిధలకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక జ్ఞాపికలను అందించి సత్కరించారు.

**జిల్లా విద్యాధికారి ప్రశంసలు**

నిజామాబాద్ జిల్లా తరపున రాష్ట్ర స్థాయి స్కౌట్స్ అండ్ గైడ్స్ వేడుకలలో పాల్గొన్న విద్యార్థులకు జిల్లా విద్యాధికారి పి. అశోక్ తన కార్యాలయంలో ప్రశంస పత్రాలు అందించి ప్రశంశించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో స్థిరపడవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ. విజయ భాస్కర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె. సాల్మన్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య, వ్యాయమ ఉపాద్యాయుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతికి స్వాగతం పలికిన ఎంపీ అరవింద్.

**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్:**



రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్వాగతం పలికారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రపతి గురువారం సాయంత్రం రాష్ట్రానికి చేరుకున్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆమెకు ఎంపీ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

# కులగణనతో బీసీలకు న్యాయం.

## - బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 21:**

కులగణన జరిగితేనే బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత, అన్ని రంగాల్లో న్యాయం కలుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం నగరంలోని మేరు భవన్ లో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్దాల తర్వాత బీసీ కులగణన జరుగుతోందని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బీసీలు ఎంతో రిజర్వేషన్లు అంతే రావాలని, ఇది సాధ్యం కావాలంటే కుల గణన జరగాల్సిందేనన్నారు. బీసీ బిడ్డ మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడు కావడంతోనే రాష్ట్రంలో సర్వే సాధ్యమైందన్నారు. 8 శాతం కూడా లేని అగ్రవర్ణాలు 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు సాధించారని పేర్కొన్నారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, కానీ బీసీలకు రాజ్యాంగ బద్ధ అధికారాలు లేకపోవడంతో అన్యాయం జరుగుతుందని తెలిపారు. బ్రిటిష్ కాలంలో జరిగిన కులగణనలో 54శాతం బీసీలు ఉన్నట్లు తెలిసిందన్నారు. ప్రస్తుతం 130 కులాలతో సుమారు 60 శాతం ఉంటామన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్, ఉద్యోగ సంఘం ప్రతినిధి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, బుస్సా ఆంజనేయులు, ప్రసాద్, రవీందర్, దేవేందర్, గంగా కిషన్, శంకర్, శ్రీలత, నారాయణరెడ్డి, హన్మాండ్లు, లక్ష్మణా చారి తదితరులు పాల్గొన్నారు.

# జి.ఓ.నెం.29 రద్దు చేయాలి.

**పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ డిమాండ్.**

**తెలంగాణ యూనివర్సిటీ గ్రంథాలయం ముందు నిరసన.**




**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, నవంబర్ 21:**

తెలంగాణ రాష్ట్రంలోని గ్రూప్-1 నియామకాల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ వర్గాల అభ్యర్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీసే జి.ఓ. నెంబర్. 29 రద్దు చేయాలని జీవో నెంబర్ 55ను పునరుద్ధరించాలని పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ యూనివర్సిటీ గ్రంథాలయం ముందు పీడీఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ, తక్షణమే జీవో నంబర్ 29 రద్దు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ అభ్యర్థులకు అన్యాయం జరగకుండా జీవో 55 పునరుద్ధరించి ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ బేషజాలాలకు పోకుండా గ్రూప్-1 అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయడానికి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థులతో చర్చలు జరపాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్స్ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు.

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ వర్గాల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయాలని చూస్తే రేవంత్ రెడ్డి సర్కార్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 29 రద్దు చేసిన తర్వాతనే గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అనుసరించినటువంటి విధానాలని అనుసరిస్తూ దుందుడుకు స్వభావంతో పోవడానికి పోతే తగిన గుణపాఠం తప్పదు అన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యార్థి, గ్రూప్-1 ఇతర నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి పెద్ద ఎత్తున సంఘటితంగా ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# గాంధీ భవన్ వద్ద జుక్కల్ కాంగ్రెస్ నాయకుల ధర్నా.

## - ఎంఎల్‌ఏ పై పిసిసి చీఫ్ కు పిర్యాదు.

**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్:**



జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గురువారం గాంధీభవన్ ముందు నిరసన చేపట్టారు. జుక్కల్ ఎమ్మెల్యే తమకు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తూ సీనియర్ కాంగ్రెస్ నాయకులను విస్మరిస్తున్నారని సీనియర్ నాయకులను పట్టించుకోవడం లేదన్నారు. దీంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు ఫిర్యాదు చేశారు. అనంతరం గాంధీభవన్ ఎదుట కూర్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు సౌదాగర్ అరవింద్, జయప్రద, కమల్ సెట్, వినోద్, సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

# "జీవనభృతి" కోసం బీడి కార్మికుల ఆందోళన.

## - బిఎల్ టియు, ఏఐఎఫ్ టియు ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ముట్టడి.





**వేగుచుక్క న్యూస్. బాన్సువాడ, నవంబర్ 21**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీడి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు జీవన భృతి 4016 రూపాయలు ఇవ్వాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు, కార్యదర్శి ఆంజనేయులు, తెలంగాణ శ్రామిక శక్తి బీడీ వర్కర్స్ యూనియన్ (ఎఐఎఫ్ టీయూ) అధ్యక్షురాలు అనసూయ, రాష్ట్ర నాయకురాలు వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బాన్సువాడ లో ర్యాలీ నిర్వహించి, ఆర్డీఓ కార్యాలయంను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2014 సంవత్సరం కటాఫ్ ను ఎత్తివేసి, ఎలాంటి షరతులు లేకుండా జీవన భృతి పెంచి అమలు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికలలో బీడీ కార్మికులకు జీవన భృతి పెంచి ఇస్తామన్న హామీ బుట్ట దాఖలు అయిందనీ అన్నారు. లక్షలాది మంది బీడీ కార్మికుల ఓట్లతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అనేక హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన పోచారం శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం నోరు మెదపడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి షరతులు లేకుండా 4016 రూపాయల జీవన భృతి బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులు, ప్యాకర్లకు, బట్టి, చటన్ తదితరులకు అమలు చేయాలని అన్నారు. లేదంటే రానున్న స్థానిక ఎన్నికలలో బీడీ కార్మికులు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కేంద్రం ప్రభుత్వం బీడీ పరిశ్రమపై అనేక ఆంక్షలు, కోస్టా చట్టం, జిఎస్టి పెట్టడం వల్ల యాజమాన్యాలు ఉత్పత్తి తగ్గిస్తున్నారని అన్నారు. దీని వల్ల బీడీ కార్మికులకు చేతినిండా పనిలేకుండా పోతుందని,

నెలలో 10 రోజులు కూడా కంపనీ నడవడం లేదన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి లేకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు

పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జీవన భృతి పెంచి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం నాయకులు నాగరపు ఎల్లయ్య, శ్రామిక శక్తి బీడి వర్కర్స్ యూనియన్ నాయకులు కుర్తి లింగం, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు క్రీడ పోటీలు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 21:**



జిల్లా మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల మరియు విభిన్న వ్యక్తుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆటల పోటీలను గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు.

ట్రై సైకిల్స్ రేసు, రన్నింగ్, చెస్, క్యారమ్స్, షాట్ పుట్ లాంటి ఆటల పోటీలను నిర్వహించారు. ఈ ఆటల పోటీలలో స్నేహ సొసైటీ, ఏపీ ఫోరం, గ్రీసి ఆర్గనైజేషన్ ద్వారా నడపబడుచున్న ప్రత్యేక పాఠశాల లోని మానసిక దివ్యాంగ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీ అంకిత్ పాల్గొని జెండా ఊపి పోటీలను ప్రారంభించగా, జిల్లా సంక్షేమ అధికారి ఎస్.కె రసూల్ బి, జిల్లా దివ్యాంగుల కమిటీ సభ్యులు రాజన్న, స్నేహ సొసైటీ సిద్దయ్య, జ్యోతి, ఏపీ ఫోరం రమేష్, స్వరూప, గ్రేసీ ఆర్గనైజేషన్ శోభా తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన ధరలకు వ్యతిరేకంగా ఉద్యమించండి.

## - కార్మిక, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 21:**



కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ సంఘాల ఐక్య కార్యకరణ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. దాసు, ఏఐకేఎస్ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య లు మాట్లాడుతూ, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు.

రైతు ఉద్యమ సమయంలో దేశ రైతాంగానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. ఉచిత నాణ్యమైన విద్యా, వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి చర్యలను ఆపాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ ఆరోగ్య భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 26న జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎస్కేయం జిల్లా బాధ్యులు వి. ప్రభాకర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఏకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు సాయన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు, ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, పాల్గొన్నారు.

# జిజిఎచ్ ను సందర్శించిన పోలీస్ శాఖ డీజీ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 21**



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని పోలీస్ శాఖ డైరెక్టర్ జనరల్(డీజీ) అనిల్ కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమ మాట్లాడుతూ, ఆసుపత్రిలో సిబ్బంది పెంచాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డీజీని కోరారు.




# పోలీసు శాఖ ప్రతిష్టను పెంపొందించాలి.

♦ క్రమ శిక్షణతో విధులు నిర్వహిస్తూ, ఫ్రెండ్లి పోలీసు అమలు చేయాలి.

♦ దీక్షాంత్ పరేడ్ లో ఐజీ అనిల్ కుమార్ పిలుపు.













**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 21 :**

నూతనంగా పోలీస్ శిక్షణ పొందిన కానిస్టేబుళ్లు క్రమ శిక్షణ తో విధులు నిర్వహిస్తు, పోలీసు శాఖ ప్రతిష్టను పెంపొందించాల డైరెక్టర్ జనరల్ (ఎస్.పి.ఎఫ్) అనిల్ కుమార్ అన్నారు. ఫ్రెండ్లి పోలీసు అమలు చేస్తూ, ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించాలని పిలుపునిచ్చారు. గురువారం జిల్లాలోని జాన్కంపేట పోలీస్ శిక్షణ కేంద్రం లో సైబరాబాద్ నుండి ఎ.ఆర్ క్యాటగిరిలో కానిస్టేబుల్స్ ఎంపిక కాబడిన స్టయిపండరీ క్యాడెట్ ట్రెయినీ కానిస్టేబుల్స్ కు 9 నెలల పాటు జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో 250 మందికి " దీక్షాంత్ పరేడ్ ( పాసింగ్ అవుట్ పరేడ్) కార్యాక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐజీ అనిల్ కుమార్ హాజరై, మాట్లాడారు. విధులు నిర్వహిస్తూనే, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేయాలని అన్నారు. పోటు పరీక్షలు రాస్తూ ఐఎఎస్, ఐపిఎస్ లు సాధించాలని అన్నారు. ప్రతీ సిబ్బందికి ఆర్థిక క్రమశిక్షణ అనేది అత్యంత ఆవశ్యకం, సులువుగా డబ్బు సంపాదన వైపు చూడకుండా మీ జీవితాలను ఆదర్శప్రాయంగా ఉంచుకోవాలని సూచించారు. మీలో 80 శాతం మంది గ్రాడ్యుయేట్లు, 20 శాతం మంది పోస్టు గ్రాడ్యుయేట్లు ఉన్నారని, విధులను సక్రమంగా బాధ్యతలతో నిర్వహిస్తారని ఆశిస్తున్నానని అన్నారు. దీక్షాంత్ పరేడ్ లో ప్రదర్శన చాలా బాగుందని, శిక్షణ ఇచ్చిన సిబ్బందిని (ఫ్యాకల్టీని ) అభినందించారు. అంతకు ముందు శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల నుండి డైరెక్టర్ జనరల్ గౌరవ వందనంస్వీకరించి, పరేడును వీక్షించారు. అనంతరం

కానిస్టేబుళ్లతో ప్రిన్సిపల్ బి కోటేశ్వర్ రావ్ ప్రమాణం చేయించారు. శిక్షణలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన బెస్ట్ ఇండోర్ ఎ. రాజు, బెస్ట్ అవుట్ డోర్ ఎమ్. నరేష్, బెస్ట్ ఫైరర్ ఎ.క్రాంతి కుమార్,

ఒవరాల్ చాంపియన్ కె. హర్ష వర్ధన్, పరేడ్ కమాండర్ జె.వాసు లకు బహుమతులను డైరెక్టర్ జనరల్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఇంచార్జ్ పోలీస్ కమీషనర్ సిహెచ్ సింధు శర్మ తో పాటు సయ్యద్ మస్తాన్ అలీ (సి.టి.సి వైస్ ప్రిన్సిపాల్ ), అదనపు డి.సి.పి లు, 7వ బెటాలియన్ అడిషనల్ కమాండెంటు, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, స్పెషల్ బ్రాంచ్, సి.సి.ఎస్, ట్రాఫిక్, సి.సి.ఆర్.బి , ఎ.సి.పిలు, సి.ఐలు, ఎస్.ఐలు. స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, శిక్షణ పొందిన వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.







